సాక్షి
కామారెడ్డి
సోమవారం । 1 । జూలై । 2024



పదెకరాల్లోపు భూమికే..

ప్రభుత్వం రైతు వేదికలలో సమావేశాలు నిర్వహిస్తూ రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు సేకరిస్తోంది.

- 9లో ▸



వసతులు కరువు

నాగిరెడ్డిపేటలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేసినా.. వసతులు లేక తరగతులు ప్రారంభం కాలేదు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /22.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

అనధికార క్రమబద్ధీకరణ సరైనది కాదు



కామారెడ్డి టౌన్: ప్రస్తుతం జరుగుతున్న ఎస్జీటీ బదిలీల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో చాలా పాఠశాలల్లో ఖాళీలు చూపించడం లేదని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో కూడా విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో పోస్టులను భర్తీ చేయలేదని వివరించారు. ఈ విధంగా ప్రభుత్వం, అధికారులు దొంగచాటుగా రేషనలైజేషన్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. టీచర్ పోస్టుల అనధికారిక క్రమబద్ధీకరణను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

వంతెన పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లికలాన్ గ్రామశివారులో పోచారం ప్రధానకాలువపై చేపట్టిన సింగిల్ లేన్ రోడ్ బిట్ (ఎస్ఎల్ఆర్‌బీ) వంతెన నిర్మాణ పనులను ఆదివారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సంబంధిత గుత్తేదారును ఆదేశించారు. లింగంపల్లికలాన్ సమీపంలోని ప్రధానకాలువపై వంతెన నిర్మాణం కోసం రూ. 50 లక్షల 60 వేల నిధులు మంజూరయ్యాయన్నారు. ఇరిగేషన్ సిబ్బంది యాదగిరి ఉన్నారు.

'మన్‌కీ బాత్'లో బీజేపీ నాయకులు



కామారెడ్డి టౌన్ : ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పట్టణంలోని 249వ పోలింగ్ బూత్‌లో బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ యోగా, భారత సంస్కృతి తదితర విషయాలపై చర్చించారన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, నందివేణు, సంతోష్ రెడ్డి, రాజేష్, భరత్, రాజగోపాల్, నరేష్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్‌ఫ్లో

బాల్కొండ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో పెరిగింది. జలాశయంలోకి 3,767 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా తాగు నీటి కోసం 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 234 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1059.60(10.18 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

దేశం కోసం ఏ త్యాగమైనా చేసేవారే స్వయం సేవకులు



సుభాష్‌నగర్ : దేశం కోసం, హిందూ ధర్మం కోసం తమ తనువు, మనస్సు, ధనం, శక్తి సర్వస్వం సమర్పించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే సైనికులే స్వయంసేవకులని ఆర్ఎస్ఎస్ ఇందూరు విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ కృష్ణశాస్త్రి విజయభాస్కర్ అన్నారు. నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఉన్న అక్షరధామ్ పాఠశాలలో నిర్వహించిన ఇందూరు నగర స్వయం సేవకుల సాంఘిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో నగర కార్యవాహ అర్గుల సత్యం స్వయం సేవకులు పాల్గొన్నారు.



డీఎస్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపీ ఈటల, కాంగ్రెస్ నేతలు వీహెచ్, షబ్బీర్‌అలీ, మాజీ ఎంపీ లగడపాటి



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

అశ్రునయనాలతో అంత్యక్రియలు

- అధికార లాంఛనాలతో పూర్తయిన డీఎస్ దహన సంస్కారాలు
- అంతిమయాత్రకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- కన్నీళ్లతో తుది వీడ్కోలు పలికిన అభిమానులు

ఖలీల్‌వాడి/నిజామాబాద్‌రూరల్/డిచ్‌పల్లి: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ అంత్యక్రియలు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధుల అశ్రునయనాల మధ్య ఆదివారం ముగిశాయి. నిజామాబాద్ నగరంలోని ప్రగతినగర్‌లో గల నివాసం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు డీఎస్ అంతిమయాత్ర ప్రారంభమైంది. కోర్టు చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేకమాన్ నుంచి కంఠేశ్వర్, కంఠేశ్వర్ బైపాస్ నుంచి డీఎస్ వ్యవసాయక్షేత్రం వరకు సాగింది. బైపాస్ రోడ్‌లోని వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, డీఐజీ సుధీర్‌బాబు, సీపీ కల్మేశ్వర్ పర్యవేక్షించారు. వ్యవసాయ క్షేత్రం వద్ద డీఎస్ భౌతికకాయానికి మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంత్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మధుయాష్కీగౌడ్, యెండల లక్ష్మీనారాయణ, ఏనుగు రవీందర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, నిరంజన్‌రెడ్డి, బస్వా లక్ష్మీనర్సయ్య, వివేక్ వెంకటస్వామి, కులాచారి దినేశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తాహెర్ బిన్ హందాన్, కేశవేణు, కే.నగేశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, లగడపాటి రాజగోపాల్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్, అడిషనల్ కలెక్టర్ అంకిత్, ఢిల్లీ, రూరల్ నాయకులు ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో పోలీసులు డీఎస్‌కు నివాళులర్పించారు. డీఎస్ పెద్ద కొడుకు మాజీ మేయర్ డి.సంజయ్ తండ్రి చితికి నిప్పంటించారు. డీఎస్ కుమారులు ఎంపీ అర్వింద్, సంజయ్‌లను పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఓదార్చి తమ సంతాపం తెలియజేశారు. డీఎస్ అంతిమ యాత్ర సమయంలో సుమారు అరగంట పాటు వర్షం అంతరాయం కలిగించింది. వర్షంలోనే అంతిమయాత్ర కొనసాగింది. వ్యవసాయ క్షేత్రం వద్దకు భౌతికకాయం చేరేసరికి వర్షం నిలిచిపోయింది. దహన సంస్కారాలు కొనసాగాయి.



డీఎస్ అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు

డీఎస్‌కు నివాళులర్పించిన ప్రముఖులు

సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్ ద్వారా నిజామాబాద్‌లోని కొత్త కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గాన ప్రగతినగర్‌లోని డీఎస్ నివాసానికి చేరుకుని పార్థీవ దేహానికి నివాళులర్పించారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, అధికారులు, వివిధ పార్టీల నేతలు డి.శ్రీనివాస్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



అధికార లాంఛనాల్లో భాగంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



డీఎస్ చితికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్

డీఎస్ కుటుంబానికి అండగా ఉంటాం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి: డీఎస్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని ప్రగతినగర్‌లో గల డీఎస్ నివాసంలో పార్థీవదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో డి.శ్రీనివాస్ క్రమశిక్షణ గల కార్యకర్తగా పని చేశారన్నారు. అందుకే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ నుంచి సోనియాగాంధీ వరకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల నాయకులను డీఎస్ ఎంతో ప్రోత్సహించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన డీఎస్ ఉమ్మడి రాష్ట్రంలో కీలక నేతగా కొనసాగారని, 2004లో పీసీసీ అధ్యక్షుడిగా పని చేసి ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారన్నారు. దీంతో 2009లోనూ సోనియాగాంధీ పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటులోనూ డి.శ్రీనివాస్ కీలకపాత్ర పోషించారని, ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. డీఎస్ కాంగ్రెస్‌లోకి వస్తానని చెప్పారని.. ఆ సమయంలో ఏ పదవి కావాలని అడిగితే.. 'అన్ని రకాల పదవులు అనుభవించానని, ఎలాంటి పదవులు వద్దని, తన మరణానంతరం భౌతికకాయంపై కాంగ్రెస్ జెండా కప్పాలని' కోరారని చెప్పారు. డీఎస్ మృతి చెందారని తెలియగానే అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేయాలని సహచర మంత్రులకు సూచించానన్నారు.డీఎస్ పార్థీవదేహంపై కాంగ్రెస్ కండువాను కప్పి ఆయన కోరికను నెరవేర్చినట్లు తెలిపారు. డీఎస్‌తో పాటు వారి కుమారులైన సంజయ్, అర్వింద్‌లతో సంబంధాలు ఉన్నట్లు చెప్పారు. డీఎస్ గౌరవం ఇనుమడించేలా, ఆయనను ప్రజలు, అభిమానులు ఎల్లవేళలా గుర్తుంచుకునేలా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అంగన్‌వాడీల్లో రిటైర్మెంట్ అమల్లోకి!

- 65 ఏళ్లు పైబడిన వారు ఇక ఇంటికి..
- టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50 వేలు సాయం
- జిల్లాలో విరమణ పొందనున్న 51 మంది టీచర్లు, 117 మంది హెల్పర్లు

సాక్షి, కామారెడ్డి : మహిళా, శిశు సంక్షేమ శాఖలో భాగమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ అమల్లోకి వచ్చింది. 2024 ఏప్రిల్ 30 వరకు 65 ఏళ్లు పైబడిన టీచర్లు, హెల్పర్లందరికీ వెంటనే రిటైర్మెంట్ వర్తింపజేస్తూ మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ నుంచి శనివారం ఉత్తర్వులు వెలుబడ్డాయి. ఉత్తర్వులు తక్షణమే అమలు చేస్తూ.. జూలై ఆరంభం నుంచి వారి అటెండెన్స్ నమోదు చేయడం గానీ, వేతనం చెల్లించడం కానీ నిలిపివేయాలని సీడీపీవోలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. జిల్లాలో 65 ఏళ్లు పైబడిన 51 మంది టీచర్లు, 117 మంది హెల్పర్లు ఉన్నట్టు ఇప్పటికే అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. కొన్నేళ్లుగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్‌పై చర్చ నడుస్తోంది. టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50 వేలు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ కింద ఇవ్వనున్నారు. దీంతోపాటు వారికి సామాజిక పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇవ్వాలని గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై నాన్చుతూ వచ్చిన ప్రభుత్వం గతంలో నిర్ణయించిన విధంగానే సాయం అందించాలని ఉత్తర్వులు వెలువరించింది. జూలై నుంచి వారు విధుల్లోకి రావలసిన అవసరం లేదంటూ ఉత్తర్వులు జారీ చేయడంతో టీచర్లు, హెల్పర్లు నిరాశకు గురవుతున్నారు.

ఖాళీల భర్తీ ఎప్పుడో?

65 ఏళ్లు పైబడిన టీచర్లు, హెల్పర్లు సోమవారం నుంచి విధులకు వెళ్లాల్సిన అవసరం లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్న నేపథ్యంలో ఆయా కేంద్రాలను ఎవరు నిర్వహించాలన్న దానిపై స్పష్టత రావడం లేదు. ఇప్పటికే జిల్లాలో చాలా చోట్ల టీచర్లు, ఆయాలు లేరు. కొన్ని చోట్ల టీచర్లు, కొన్ని చోట్ల ఆయాలే కేంద్రాలను నిర్వహిస్తున్నారు. రిటైర్మెంట్ మూలంగా ఖాళీ అయ్యే స్థానాలను ఎప్పుడు భర్తీ చేస్తారన్నదానిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కేంద్రాల పరిధిలో సేవలు నిలిచిపోయే అవకాశం ఉంది.

అడ్మిషన్లు అడగకండి

- నాగిరెడ్డిపేట కేజీబీవీలో ప్రవేశాలు ఫుల్
- నో అడ్మిషన్స్ బోర్డు ఏర్పాటు


నాగిరెడ్డిపేట : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలలో అడ్మిషన్లు జరిగాయి. పరిమితికి మించి అడ్మిషన్లు జరగడంతో సిబ్బంది 'అడ్మిషన్స్ క్లోజ్' అంటూ బోర్డ్ ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఒక్కో తరగతిలో 40 చొప్పున 200 సీట్లు కేటాయించారు. అయితే అంతకు మించి విద్యార్థినులు పాఠశాలలో ఉన్నారు. ఈ ఏడాది పాఠశాలలో 87 మంది ప్రవేశాలు పొందారు. ఇందులో ఆరో తరగతిలో 65 మంది, 7, 8, 9 తరగతుల్లో 22 మంది జాయిన్ అయ్యారు. దీంతో కొత్తగా చేరిన వారితో కలిసి బడిలో విద్యార్థినుల సంఖ్య 274కి చేరింది. ఇంకా ప్రవేశాల కోసం వస్తుండడంతో పాఠశాలలో అడ్మిషన్లు క్లోజ్ అయ్యాయని బోర్డ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల నేపథ్యంలో అడ్మిషన్ల కోసం విద్యార్థినులు తరలి వస్తున్నారని సిబ్బంది తెలిపారు.



అడ్మిషన్లు లేవంటూ ఏర్పాటు చేసిన బోర్డు

వైద్యులు.. కనిపించే దేవుళ్లు

- ఎంతోమందిని ప్రాణాపాయం నుంచి కాపాడారు
- మరచిపోలేని సంఘటనలు ఎన్నో..
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



సాక్షి, కామారెడ్డి : వైద్యో నారాయణ హరీ అంటూ వైద్యున్ని దైవంతో పోలుస్తుంటారు. చావు బతుకుల్లో ఉన్న రోగికి వైద్యం అందించి ప్రాణభిక్ష పెడతారు కాబట్టి వైద్యుడికి అంత గౌరవం ఉంటుంది. ఒక్కోసారి కుటుంబ సభ్యులు కూడా ఆశలు వదులుకున్న సమయంలో డాక్టర్‌లు చేసిన ప్రయత్నాలతో బతికి బయటపడ్డవారెందరో ఉన్నారు. తాము చదివిన, నేర్చుకున్న వైద్య విద్యలో ఎన్నె అద్భుతాలు సాధించిన వైద్యులు ఎంతో మందికి లైఫ్ ఇచ్చారు. కొన్ని సందర్భాల్లో రిస్క్ చేసి కూడా ప్రాణాలు కాపాడిన ఘటనలు ఉంటాయి. వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురు వైద్యులు వారి కెరీర్‌లో మరచిపోలేని సంఘటనలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

తక్కువ బరువుతో పుట్టిన బిడ్డకు ప్రాణం పోశాం



ఆరేళ్ల క్రితం జీవదాన్ ఆస్పత్రిలో గాంధారి మండలం నేరల్ తండాకు చెందిన మహిళకు ఏడు నెలల్లోనే ప్రసవం అయింది. పుట్టిన బిడ్డ బరువు 600 గ్రాములు మాత్రమే. అంత తక్కువ బరువుతో పుట్టిన పాపను బతికించాలన్నది నాకో చాలెంజ్. దాదాపు మూడు నెలల పాటు పాపను ఆస్పత్రిలోనే ఉంచి చికిత్సలు అందించాం. పాప బతికింది. ఇప్పుడు ఆ పాప వయసు ఆరేళ్లు. స్కూలుకు వెళుతోంది. అప్పుడప్పుడు తల్లిదండ్రులు పాపని తీసుకుని వచ్చి చూపిస్తుంటారు. నా 32 ఏళ్ల సర్వీసులో ఎన్నో జ్ఞాపకాలు ఉన్నా, ఇది అరుదైనది. ఎంతో చాలెంజ్‌గా తీసుకుని వైద్యం అందించాను. జీవదాన్ ఆస్పత్రి యాజమాన్యం కూడా ఒక్క పైసా తీసుకోకుండా సర్వీస్ అందించింది.

- కె నరేందర్‌రావు, పిల్లల వైద్యుడు, కామారెడ్డి

ఆ డెలివరీ మరువలేనిది



గాంధారి పీహెచ్‌సీలో పనిచేసే సమయంలో ఓ రోజు ఓ నిండు గర్భిణిని తీసుకువచ్చారు. కడుపులో మృతశిశువు ఉంది. డెలివరీ ఆలస్యం అయితే ఆమె ప్రాణాలకే ప్రమాదం. వెంటనే డెలివరీ చేయగా మొండెం బయటకు వచ్చింది. తల కడుపులోనే ఉండిపోయింది. మత్తు వైద్యులు అందుబాటులో లేరు. థియేటర్ అసిస్టెంట్ సాయంతో మత్తు నేనే ఇచ్చి సిజేరియన్ చేసి బయటకు తీశాను. ఏమాత్రం ఆలస్యం చేసినా ఇన్‌ఫెక్షన్ అయి తల్లి ప్రాణాలు కోల్పోయేది. మూడు దశాబ్దాల కాలంలో ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు, సర్జరీలు వేలల్లో చేసినా, ఈ సంఘటన మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

- కె రాంసింగ్, మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్, కామారెడ్డి

బాబు ఊపిరి నిలిపా..



కొల్లూరుకు చెందిన ఎనిమిదేళ్ల బాబు వాంతులు, విరేచనాలతో పూర్తిగా నీరసించిపోయాడు. పల్స్ పడిపోయింది. కోమాలో ఉన్నాడు. రాత్రి 2 గంటల ప్రాంతంలో వచ్చి లేపారు. చూస్తే పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ఫ్లూయిడ్స్ ఎక్కించాలంటే వేన్స్ దొరకడం లేదు. బోన్స్‌లో ఫ్లూయిడ్స్ ఎక్కించాను. తెల్లవారేదాకా నిద్ర మానుకుని చేసిన ప్రయత్నం సక్సెస్ అయ్యింది. పల్స్ సాధారణ స్థితికి చేరింది. కోమా నుంచి బయటకు వచ్చాడు. బాబు చనిపోతాడనుకున్న ఆ కుటుంబం ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు ఆ బాబు డిగ్రీ చదువుతున్నాడు. ఆ రాత్రి ధైర్యం చేసి వైద్యం చేయడంతో బతకగలిగాడు.

- శ్రీనివాస ప్రసాద్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, బాన్సువాడ

అధిక బరువు.. ఆపై కరోనా



కరోనా సమయంలో సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం నుంచి వచ్చిన ఒక కేస్ ఉదంతం ఎన్నటికీ మరువలేను. 200 కిలోలకు పైగా బరువు ఉన్న మహమ్మద్ అనే పేషంట్‌కు సర్జరీ చేయాల్సి వచ్చింది. టెస్ట్ చేశాక అతనికి కరోనా వచ్చినట్లు తెలిసింది. బరువు అధికంగా ఉండటంతో ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లడానికి ఎంతో కష్టపడ్డాం. కరోనా సోకడంతో అతడికి నర్సింగ్ సర్వీస్ చేయడానికి మా సిబ్బంది కూడా భయపడ్డారు. ఆయనకు ఆపరేషన్ చేసేందుకు మేము పడ్డ శ్రమ ఎన్నటికీ మరువలేను.

- డాక్టర్ నాగేశ్వరరావు, సర్జన్, ఎల్లారెడ్డి

క్లుప్తంగా

డిగ్రీ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు గెస్ట్ లెక్చరల్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, ఉర్దూ సబ్జెక్టులు బోధించటానికి ఒక్కో పోస్టు ఖాళీగా ఉందన్నారు. పీజీలో 55 శాతం మార్కులు ఉన్న అభ్యర్థులు ఈ నెల 2లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేస్తామన్నారు.

నేడు రుణమాఫీపై సమావేశం

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట రైతు వేదికలో సోమవారం మధ్యాహ్నం మూడుగంటలకు రుణమాఫీపై రైతులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు అచ్చంపేట సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ తెలిపారు. స్థానిక సొసైటీ చైర్మన్ కయ్యం నర్సింహారెడ్డి అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి ప్రభుత్వ ప్రత్యేక అధికారి హాజరవుతున్నారన్నారు.

మెదక్-రుద్రూర్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



బాన్సువాడ: మెదక్-రుద్రూర్ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులతో మెదక్-ఎల్లారెడ్డి-బాన్సువాడ-రుద్రూర్ రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన పనులు మళ్లీ ప్రారంభించారు. సుమారు 112 కి.మీ పనులు ప్రారంభమయ్యాయి. బాన్సువాడ మండలం కొయ్యగుట్ట నుంచి మహ్మద్‌నగర్ మండలం బొగ్గగుడిసె వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే హైదరాబాద్‌కు వెళ్లేందుకు దూరం తగ్గుతుంది.

శీనన్నకు ఘననివాళి



ధర్మపురి శ్రీనివాస్ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ..



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి..



వీ హనుమంతరావు, తాహెర్‌బిన్ హందాన్..

ధర్మపురి శ్రీనివాస్ పార్థివదేహానికి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో రాజకీయ ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. ఆదివారం ఉదయం అంతిమయాత్ర ప్రగతినగర్ నుంచి ప్రారంభం కాగా, డీఎస్ అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మాధవనగర్ సమీపంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని డీఎస్ అందించిన సేవలను కొనియాడారు. – ఖలీల్‌వాడి



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్..



ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి..



మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్..



ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



బీజేపీ నాయకుడు ప్రేమేందర్‌రెడ్డి..



మండవ వెంకటేశ్వరరావు..



బాజిరెడ్డి జగన్..



మధుయాష్కీగౌడ్..



ఈరవత్రి అనిల్..

పోలీసులతో డీఎస్ అభిమానుల వాగ్వాదం

ఖలీల్‌వాడి: డీఎస్ పార్థివదేహాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం ప్రగతినగర్‌లోని ఆయన నివాసంలో ఉంచగా.. ఆదివారం జిల్లాకు చెందిన ఆయా ప్రాంతాలకు చెందిన వారితోపాటు నగరానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న సమయంలో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరాగా పోలీసులు వారిని లోనికి అనుమతించలేదు. దీంతో డీఎస్ అభిమానులు, మహిళలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

హాజరైన మాజీ ఎంపీ లగడపాటి..

డీఎస్ అంత్యక్రియలకు విజయవాడ మాజీ ఎంపీ., ల్యాంకో అధినేత లగడపాటి రాజగోపాల్ హాజరయ్యారు. డీఎస్ పార్థివదేహానికి నివాళులు అర్పించి.. అర్వింద్, సంజయ్‌ను ఓదార్చారు.



పోచారం సురేందర్‌రెడ్డి..



మేయర్ నీతూకిరణ్..



డీఎస్ ఇంటికి తరలివచ్చిన నాయకులు, అభిమానులు



డీఎస్ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

డీఎస్ పార్థివదేహానికి నివాళులు అర్పించిన అనంతరం పలువురు మీడియాపాయింట్ వద్ద మాట్లాడారు. ఆయనతో తమకు అనుబంధాన్ని పంచుకున్నారు. తమను రాజకీయాల్లోకి తీసుకువచ్చారని కొందరు.. ఆయన ప్రోత్సాహంతోనే తాము రాజకీయాల్లో రాణిస్తున్నామని మరికొందరు పేర్కొన్నారు.

నిజాంకాలేజీ నుంచి స్నేహితులం



డీఎస్ మృతి వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. నిజాం కళాశాల నుంచి ఇద్దరం మంచి మిత్రులం. కాంగ్రెస్‌లోని అన్నివర్గాల మన్ననలు డీఎస్ పొందారు. తెలంగాణ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించి, కాంగ్రెస్ అధిష్టానాన్ని ఒప్పించారు. డీఎస్ ఆత్మకు శాంతి చేకూరాలి.

– జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఆయన ప్రోద్బలంతోనే..



కాంగ్రెస్‌లో భవిష్యత్ ఉంటుందని డీఎస్ నాకు చెప్పారు. ఆయన ప్రోద్బలంతోనే వచ్చిన నేను ఆయన బలంతం చేయడంతోనే ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా పని చేశా. డీఎస్‌తో నాకు 40 ఏళ్ల అనుబంధం ఉంది. విబేధాలు ఉన్నప్పటికీ.. నా రాజకీయ గురువుగా ఆయన దగ్గరకు వెళ్లేవాడిని.

– మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

షాక్‌కు గురి చేసింది



డీఎస్ మృతి షాక్‌కు గురిచేసింది. 1989లో ఇద్దరం ఒకేసారి ఎమ్మెల్యేలమయ్యా. మంత్రులుగా ఒకేసారి నిజామాబాద్‌కు వచ్చాం. మాది అన్నాదమ్ముళ్ల అనుబంధం. శీనన్న అని పిలిచేవాడిని. మైనార్టీ బిల్లును డీఎస్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. తెలంగాణ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల తీసుకువచ్చారు.

– షబ్బీర్ అలీ, ప్రభుత్వ సలహాదారు

నాకు ఎంపీ టికెట్ ఇచ్చారు



శీనన్న మరణం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. నా రాజకీయ గురువు, ఆత్మీయుడు శీనన్న. విదేశాల నుంచి నుంచి వచ్చిన నాకు నిజామాబాద్ ఎంపీ టికెట్‌ను ఇచ్చేలా సోనియా గాంధీని ఒప్పించారు. నిజామాబాద్‌కు మెడికల్ కళాశాల తీసుకొచ్చిన ఘనత శీనన్నదే. తెలంగాణ ఏర్పాటులో డీఎస్‌ది కీలక పాత్ర.

– మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపీ

తెలంగాణ ఇవ్వాలని కోరారు



తెలంగాణ ఇవ్వాలని బలంగా కోరిన వ్యక్తి డీ.శ్రీనివాస్. మంచి మిత్రుడిని కోల్పోయా. ఆయన మృతి బడుగు, బలహీనర్గాలకు తీరని లోటు. అర్గుల్‌రాజారాం శిష్యుడిగా అంచెలులంచెలుగా ఎదిగారు. 2004లో కాంగ్రెస్ అలయెన్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఏర్పడటంలో కీలకంగా వ్యవహరించారు.

– వీ హనుమంతరావు, మాజీ రాజ్యసభ సభ్యులు

నన్ను పార్టీ సెక్రెటరీ చేశారు



కాంగ్రెస్‌కు నీ అవసరం ఉందని 1985లో నన్ను జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీని చేశారు. ఎమ్మెల్యే టిక్కెట్ వచ్చేలా సహకరించారు. డీఎస్ ప్రజల మని షి. అందరిని కలుపుకుని వెళ్లా రు. పార్టీ ఒక వ్యూహకర్తను కోల్పోయింది.

– సుదర్శన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే

ఆయన సలహాలు తీసుకున్నా



డీఎస్ ఎప్పుడూ జిల్లా అభివృద్ధిపై చర్చించేవారు. టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఆయన సలహాలు తీసుకున్నా. ఆయనను రాజకీయ గురువుగా భావించాను. రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా ఆయన పార్టీకి ఎన్నో సేవలందించారు.

–ఆర్ భూపతిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే

ప్రజలకు తీరని లోటు



డీఎస్ నిజామాబాద్ అర్బన్‌ను అభివృద్ధి చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూపకల్పన చేసింది ఆయనే. నా భర్త దండు శేఖర్‌కు రాజకీయ గురువు.

– నీతూకిరణ్, మేయర్, నిజామాబాద్

డీఎస్ బీసీ వాది



డీఎస్‌కు బీసీవాదిగా గుర్తింపు ఉంది. క్రమశిక్షణ గల వ్యక్తి. బడుగు, బలహీనవర్గాల కాంగ్రెస్‌లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారు. డీఎస్ చివరి రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన కోరికను నెరవేర్చారు. డీఎస్ పార్థివదేహంపై కాంగ్రెస్ జెండాను కప్పారు.

– నిరంజన్, పీసీసీ ఉపాధ్యక్షుడు

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కామారెడ్డి టౌన్: యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని శిశు మందిర్ పాఠశాలలో యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రసంశా పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ యాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అర్కల ప్రభాకర్ యాదవ్, ప్రొఫెసర్లు ఉదయ్ కుమార్, రాహుల్ యాదవ్, ప్రతినిధులు, భూమేష్, కృష్ణ, కిష్టయ్య, శివరాజు, రాములు పాల్గొన్నారు.

పీఎంపీ, ఆర్ఎంపీల సమ్మేళనం



కామారెడ్డి టౌన్: మండల కేంద్రంలోని రాజంపేట మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో 1982–2024 మధ్య కాలంలో పని చేస్తూ శిక్షణ పొందిన వారంతా ఒక్క చోట కలిశారు. డాక్టర్ సిద్ధిరాములతో పాటు ఆయన కుమారుడు డాక్టర్ రవీంద్రమోహన్ వద్ద పని చేసి గ్రామాల్లో ప్రాథమిక చికిత్సలు అందిస్తున్న పీఎంపీలు, ఆర్ఎంపీలు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులను ఘనంగా సత్కరించారు. రోజంతా సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా వైద్యుడు సిద్ధిరాములు మాట్లాడుతూ.. తన వద్ద శిక్షణ పొంది గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్న 120 మందికిపైగా ప్రాక్టీషనర్లు ఆప్యాయతతో సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. సుమారు 42 సంవత్సరాల కష్టానికి ఫలితం కళ్ల ముందు కనిపిస్తోందన్నారు.

భగవద్గీత సత్సంగం



కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామారెడ్డి రోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో భగవద్గీత సత్సంగం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భజనలు, నృత్యాలు, హారతి, అన్నప్రసాద వితరణ చేశారు. బాధ్యులు వెంకటదాస్ ప్రభు, శ్రీహరిదాస్, అశోక్‌ప్రభు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217
[M-1185231]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వార్డు సమస్యలను పరిష్కరిస్తా

కామారెడ్డి టౌన్: పట్టణంలోని 35వ వార్డు కాకతీయనగర్‌కాలనీలో అధికారులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పర్యటించారు. కాలనీలోని సమస్యలను చైర్‌పర్సన్‌కు కాలనీవాసులు వివరించారు. కాలనీలో మురికి కాలువలు, రోడ్లు, నీటి, ఓపెన్ ప్లాట్‌లో పిచ్చి మొక్కల తదితర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఏఈ శంకర్, సానిటరీ ఎస్సై రవీందర్, జవాన్ రాజేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీ నృసింహాస్వామి ఆలయ అభివృద్ధి కోసం హైదరాబాద్ వాస్తవ్యులు కదిర పాపిరెడ్డి, లక్ష్మీ రూ. 10వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ సిబ్బంది సంతోష్ కుమార్ దాతలను సన్మానించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : బైక్ అదుపుతప్పిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మండలంలోని కామిశెట్టిపల్లి గ్రామం వద్ద ప్రధాన రోడ్డుపై శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ మండలం రాంపూర్ కల్దుర్కి గ్రామానికి చెందిన ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి నవీన్ ఆఫీస్ పని ముగించుకుని బాన్సువాడ నుంచి బోధన్ వైపు వెళ్తుండగా శనివారం అర్ధరాత్రి కామిశెట్టిపల్లి వద్ద బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో అక్కడికక్కడే నవీన్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): జుక్కల్ మండలంలోని కౌలాస్‌కోటను చూసేందుకు స్నేహితులతో కలిసి వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ కాలనీ చెందిన గంగిశెట్టి శ్రీకాంత్(19)తోపాటు అతడి స్నేహితులు కౌలాస్‌కోటను చూసేందుకు ద్విచక్ర వాహనాలపై వచ్చారు. కోటను సందర్శించిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా పెద్దకొడప్‌గల్ మండలం జగనాథ్‌పల్లి తండా సమీపంలో 161 జాతీయ రహదారిపై అతివేగంగా దూసుకొచ్చిన లారీ శ్రీకాంత్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితుడిని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. గాయాలైన శ్రీకాంత్ మేనమామ రంగవేణి మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

ఎల్లారెడ్డి: మండలంలోని జంగమాయిపల్లి గ్రామానికి చెందిన రైతు పూజారి హనుమయ్య(62) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పొలంలో ఆదివారం నాట్లు వేస్తున్న సమయంలో బోరుమోటార్‌ను ఆఫ్ చేసేందుకు వెళ్లిన హనుమయ్య స్టార్టర్ బాక్సును ముట్టుకోగా విద్యుత్ షాక్ తగిలింది. ఈ ఘటనలో హనుమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరుచోట్ల అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి



రవికుమార్ మృతదేహం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్‌కు చెందిన బండ రవి(37) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బండ రవి శనివారం రాత్రి తన బంధువులతో కలిసి మద్యం సేవించాడు. రాత్రి 9గంటల సమయంలో రవికి అతడి భార్య లావణ్య ఇంటికి రావాలని ఫోన్ చేయగా.. ఇక్కడ గొడవ అవుతోందని, తరువాత వస్తానని చెప్పాడు. ఎక్కడ గొడవ జరుగుతోంది.. నేను వస్తాను అని భార్య అనగా, నేను వస్తా అవసరం లేదని ఫోన్ కట్ చేశాడు. ఆ తరువాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. పిల్లలు ఏడుస్తుండడంతో లావణ్య వారితోపాటు నిద్రపోయింది. ఆదివారం ఉదయం కాలనీవాసులు వచ్చి నీ భర్త ఓ దుకాణం ఎదుట పడి ఉన్నాడని లావణ్యకు తెలుపంతో ఆమె అక్కడికి వెళ్లి చూడగా రవి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.


జన్నేపల్లిలో..

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో సుద్దపల్లి చంద్రన్న(47) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ ఆదివారం తెలిపారు. నందిపేట మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన చంద్రన్న బతుకుదెరువు కోసం ఎనిమిదేళ్ల కిందట భార్యాపిల్లలతో కలిసి జన్నేపల్లికి వచ్చాడు. ఇటీవల కాలంలో చంద్రన్నకు అతడి భార్యతో గొడవలు జరుగుతున్నాయి.

శనివారం ఉదయం సిద్ధాపూర్‌కు వెళ్లిన ఇరువురు అక్కడ.. రాత్రి జన్నేపల్లికి వచ్చిన తరువాత మళ్లీ గొడవపడ్డారు. ఈ క్రమంలో రాత్రి సమయంలో చంద్రన్న ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువు సాయిలు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిష్కారమైన భూ వివాదం

- మోతెలో నాలుగేళ్లుగా రగులుతున్న సమస్య
- ఊపిరిపీల్చుకున్న రెవెన్యూ, పోలీసు విభాగం



మోతెలోని వివాదాస్పద భూమి

వేల్పూర్: మండలంలోని మోతె గ్రామంలో సుమారు నాలుగేళ్లుగా రగులుతున్న భూ వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. దీంతో భూమికోసం పోరాడుతున్న దళిత కుటుంబం, రెవెన్యూ, పోలీసువిభాగం, గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మోతెలోని రాజరాజేశ్వర దేవాలయం భూమి పక్కన సర్వే నంబరు 333లో ఎకరం 20 గుంటల భూమి 1962 నుంచి ఇస్సాపల్లి గంగారాం, ఇస్సాపల్లి నడ్పి గంగారం అనే వ్యక్తుల పేరుపై రికార్డుల్లో నమోదై ఉంది. అప్పట్లో ఈ భూమిని ఇస్సాపల్లి గంగారాం రాజరాజేశ్వరస్వామికి ఇచ్చారని, దేవాలయానికి ఇచ్చిన భూమిపై ఎవరు అబద్ధమాడరు అనే నమ్మకంతో పేరు మార్పిడి చేయించలేదని గ్రామస్తులు.. మా తాత ఆ భూమిని దేవాలయానికి ఇవ్వలేదని, రికార్డు ప్రకారం తమదేనని ఇస్సాపల్లి గంగారాం మనవడు ఇస్సాపల్లి రవి వాదించేవారు. ఆ భూమికి రవి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను గ్రామస్తులు నాలుగుసార్లు తొలగించడంతోపాటు హద్దురాళ్లను పగులగొట్టారు. అడ్డుకోబోయిన రవి కుటుంబ సభ్యులపై దాడి చేసి ఆ కుటుంబాన్ని బహిష్కరించారు. ఇదిలా ఉండగా, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి ఆ భూమి ఇస్సాపల్లి గంగారాం వారసులకు చెందుతుందని తేల్చిచెప్పినప్పటికీ.. గ్రామస్తులు భూమి దేవాలయానిదేనని పట్టుబట్టారు. తమపై దాడి చేసిన గ్రామస్తులపై రవి 2023లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు పెట్టడంతోపాటు సీపీ కల్మేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ గ్రామస్తులు గత బుధవారం తిరిగి దాడిచేసి ఇస్సాపల్లి గంగారం భూమిలో పాతిన హద్దురాళ్లను, ఫెన్సింగ్‌ను తొలగించారు. ఈ విషయాన్ని గంగారాం కుటుంబ సభ్యులు పోలీసులకు తెలుపడంతో.. వారు మోతె గ్రామస్తులను పిలిపించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నందుకు రిమాండ్‌కు తరలించాల్సి ఉంటుందని స్పష్టం చేయడంతో గ్రామస్తులు తమ నిర్ణయాన్ని మార్చుకొని ఇకనుంచి ఆ భూమి జోలికి రామని గంగారాం కుటుంబీకులకు రాత పూర్వకంగా రాసి ఇచ్చారు. గంగారాం కుటుంబీకులు సైతం దేవాలయానికి తమ వంతుగా 24 గుంట భూమిని విరాళంగా రాసి ఇచ్చారు. దీంతో నాలుగేళ్లుగా రగులుతున్న భూవివాదం పరిష్కారం కావడంతో అధికారులు, గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.